సంతోషంగా సంక్రాంతి సంబరాలు

నాగాయలంక: కోవిడ్-19 పరిస్థితుల తీవ్రత ముగిసిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఈ ఏడాది సంక్రాంతి సంబరాలు సంతోషంగా చేసుకున్నారు. నాగాయలంక కృష్ణానదీ తీరంలో ఆది, సోమ వారాల్లో సంక్రాంతి, కనుమ పండుగ సందడి కోలాహలంగా కనిపించింది. దూరప్రాంతాల్లో స్థిరపడి స్వగ్రామాలకు చేరుకున్న బంధువులు, స్నేహితులు నదిలో బోట్ షికారులు చేసి సెల్ఫీలు, ఇసుక తిన్నెలలో ఆటలతో ఎంజాయ్ చేశారు. కనుమ పర్వదినం పురస్కరించుకుని పలు దేవాలయాలు, గ్రామాల్లో రైతులు పశువులకు, మహిళలు గోవులకు సంక్రాంతి సంప్రదాయ ప్రత్యేక పూజలు జరిపారు. దివంగతులైన కుటుంబ పెద్దలకు గౌరవ సూచకంగా నూతన వస్త్రాలు, పొంగళ్ళు సమర్పించి సంస్కృతిని చాటుకున్నారు. మాంసం దుకాణాలు, చేపలు, రొయ్యలు భారీగా కొనుగోలు చేశారు.


ప్రత్యేక అలంకారంలో కోడూరు కల్యాణ వెంకటేశ్వరస్వామి


నాగాయలంకలో గోమాతకు పూజలు చేస్తున్న గృహిణులు

మచిలీపట్నంటౌన్: నగర వాసులు సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాల నడుమ సరదాగా నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన కుటుంబ సభ్యులతో కలిసి పిండివంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేలకు పెద్ద ఎత్తున తరలివెళ్లి పందేలను వీక్షించారు. ఆదివారం సంక్రాంతితో పాటు సోమవారం కనుమ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

కోడూరు: సంక్రాంతి పర్వదిన వేడుకలను మండల ప్రజలు ఇంటింటా ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇంటి ముంగిట్లో అందమైన రంగవల్లులను తీర్చిదిద్ది పండుగకు స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఉత్సవమూర్తులకు తిరుమంజనసేవను నిర్వహించారు. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాలస్వామివారి ఆలయంలో పూజలు చేశారు.

బంధువులతో సందడిగా ఇళ్లు....

కృత్తివెన్ను: సంక్రాంతి పండుగను ప్రజలు ఎంతో సంతోషంగా జరుపుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ పండుగను ప్రత్యేకంగా జరుపుకోవడం ఆనవాయితీ. ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగల నేపథ్యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బంధువుల రాకతో ప్రతి ఇల్లు సందడిగా మారింది. కనుమ రోజున పశుపూజల్లో భాగంగా రైతులు తమ పశువులను అందంగా అలంకరించి పూజలు చేశారు. కోడి పందేలు జోరుగా వేశారు. పందెం బరుల వద్ద పేకాట, గుండాటలను పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాటు చేసి జూదానికి తెరతీశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి పేకాట, గుండాటలను పోలీసులు అడ్డుకున్నారు.

మోపిదేవి: సంక్రాంతి పర్వదినం మూడు రోజులపాటు ఉత్సాహంగా చేసుకున్నారు. ఆదివారం కనుమ పండుగ ఆనందంగా నిర్వహించారు. పశువులను, ఎండ్ల బండ్లను అందంగా అలంకరించి మేళ తాళాలతో పుర వీధుల్లో ఊరేగించి పూజ నిర్వహించారు. బంధు మిత్రులతో గ్రామాల్లో వేడుకగా పండుగ చేశారు. నూతన వస్త్రాలు ధరించి తమ ఇష్టదైవాన్ని దర్శించుకున్నారు. ఇంటిలో పూర్వీకులు, పెద్దలను తలచుకుంటూ పలు రకాల పిండి వంటకాలు, పాయసం, తినుబండారాలు పెట్టి తమను చల్లంగా దీవించమని వేడుకున్నారు.

మచిలీపట్నంటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం సాయంత్రం మహిళా సంఘం (ఐద్వా), సీఐటీయు, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక రాజుపేట ముగ్గాలకాలనీలో నిర్వహించిన పోటీల్లో 25 మంది మహిళలు పాల్గొని పలురకాల రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


అమ్మవారికి విశేష అలంకరణ

సంక్రాంతి పండుగ రోజున తమ సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వారిలో పోటీతత్వం పెంపొందించేలా బహుమతులు అందించామని పేర్కొన్నారు. సంఘాల నాయకులు సీహెచ్ విజయలక్ష్మీ, కొడాలి సుజాత, ఎం.పద్మ, సీహెచ్ రాజేష్, కొడాలి శర్మ, ఎం.పోలినాయుడు, కేవీ రమణ, సీహెచ్ జయరావు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

గూడూరు: సంక్రాంతి పండుగను మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఇంటిల్లిపాది నూతన వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి బంధుగణం తరలిరావడంతో పల్లెలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. అతిథుల కోసం పిండి వంటలను సిద్ధం చేసి వడ్డించారు. గూడూరులో రైల్వే బోర్డు సభ్యుడు మోట్టేపల్లి రత్నారావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డాన్స్ బేబీ డాన్స్ నిర్వహించారు.


కృష్ణానదిలో బోట్ షికార్ చేస్తున్న ప్రజలు


ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రత్నారావు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఆనాటి జ్ఞాపకాలు ఎంతో మధురం

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

పెడన: ఆనాటి జ్ఞాపకాలు ఎంతో మధురమని, ఆ మధురస్మృతులు ఎన్నటికీ గుర్తుండి పోవాలనే ఉద్దేశంతోనే ఆత్మీయ సమ్మేళనం, అపూర్వ కలయికలు నిర్వహించుకుంటున్నామని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు. స్థానిక భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76లో పదో తరగతి చదివిన బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణమండపంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉర్రూతలూగించారు. కుమారి మేఘన భరతనాట్యం ఆకట్టుకోగా, పూర్వ విద్యార్థులు పలు గీతాలకు స్టేజ్‌పై నృత్యాలు చేయడంతో ఆసక్తిగా తిలకించారు. చందన నారాయణ, బొడ్డు రామమూర్తి, జల్లూరి రాధాకృష్ణ, మల్లంపల్లి శ్రీనివాసరావు, బండి రవీంద్ర, వార్ల త్రిపురసుందరి, పెరిశెట్టి టికేశ్వరి, జక్కుల ధనంజయ తదితరులతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను మరిచిపోవద్దు...

తల్లిదండ్రులను ఎప్పటికీ మరిచిపోవద్దని ఆనాటి గురువులు పూర్వ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977–78లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులు తేజోవతి, భానుమతి, సరస్వతి, జయలక్ష్మీ, ప్రభాకరావును సన్మానించి పాదాభివందనాలు చేశారు. ఈ సందర్భంగా గురవులు ఆనాటి తమ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తాము పాఠాలు నేర్పించిన విద్యార్థులు నేడు వివిధ రంగాలలో స్థిరపడి మమ్మలను గుర్తుపెట్టుకుని సన్మానించడం చాలా ఆదృష్టంగా భావిస్తున్నామని తేజోవతి అన్నారు. సన్మానం అనంతరం తమతో పాటు చదువుకుని ఆశువులు బాసిన వారికి నివాళులర్పించి మౌనం పాటించారు. కర్ల నాగమల్లేశ్వరరావు, నందం హరినాథ్, కొండుపర్తి విజయశంకర్, జన్యావుల లీలాకృష్ణ తదితరులు నేతృత్వం వహించారు.

ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ....

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో 1998వ సంవత్సరం వరకు కలసి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకుని సందడి చేశారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి 1998 వరకు కలసి చదువుకున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకున్న వీరంత 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన పాఠశాలలో కలుసుకోవాలని ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీన కుటుంబాలతో కలుసుకున్న వీరంతా గత స్మృతులు గుర్తు చేసుకుంటూ, ఒకరిని ఒకరు పలకరించుకుంటూ, ఉద్యోగ, వ్యాపార, కుటుంబ క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ అలరించారు. అనంతరం పాఠాలు నేర్పిన పాఠశాల డైరెక్టరు కె. కిషోర్, ఉపాధ్యాయులు ఎస్. శేఖర్, బి. యుగంధర్, పి. బసవయ్య, కె. శ్రీనివాస్, పి. వెంకటలక్ష్మి దంపతులను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి అందరు ఆయురారోగ్యలతో ఆనందంగా ఉండాలని ఆశీర్వదించారు.


1975-76 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులతో కొమ్మారెడ్డి పాఠశాల 1998 పూర్వ విద్యార్థులు


ఆనాటి గురువు తేజోవతిని సన్మానిస్తున్న 1977-78 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు

బంటుమిల్లి: మండల పరిధిలోని ములపర్రు గ్రామంలో ఐద్వా మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, పురుషులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంప్రదాయ పోటీలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు రంగవల్లులు, మ్యూజికల్ చైర్ ఆటలు, పురుషులకు పలు రకాల ఆటలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో చిగురుశెట్టి రమాదేవి, కె. భవ్యశ్రీ, ఎ. అనురాధ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఈ బహుమతులను స్థానికులు వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం అందచేశారు. మ్యూజికల్ చైర్ పోటీలో కె. సౌజన్య విజేతగా నిలిచారు. పురుషుల బ్యాట్‌మెంటన్ పోటీలో టి. అఖిలేష్, బి. రాజ విన్నర్సగా, జి. మణికంఠ, బి. శ్రీనివాస్ రన్నర్సగా నిలిచారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ, ఐద్వా సంఘ నాయకులు జి. నాగేశ్వరరావు, ఎల్. అజయ్, ఎల్. సుజాత, ఎం. పద్మ, ఎస్. కృష్ణ, బి. మధు, జి. సుబ్రహ్మణ్య తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలు పరిశీలిస్తున్న ప్రజలు

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని వినతి

అవనిగడ్డ: అవనిగడ్డ వంతెన సెంటర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుతూ పలు సంఘాలకు చెందిన ఎస్సీ నేతలు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకి వినతి పత్రం సమర్పించారు. కార్యాలయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావుని సోమవారం కలుసుకుని విన్నవించారు. గత 30 సంవత్సరాల నుంచి డిమాండ్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని మీ హయాంలో విగ్రహం ఏర్పాటు అయ్యేలా చూడాలని కోరారు. మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, న్యాయవాది పులి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నలుకుర్తి రమేష్, కె.మోహన్‌బాబు, చింతా ప్రసాద్, నీలా బింద్రన్, కీర్తి వర్ధన్, దోవారి చైతన్య, బేతి వెంకటేశ్వరరావు, నీలా మనోహర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకి వినతి పత్రం ఇస్తున్న ఎస్సీ నేతలు

క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి ఊంజల సేవ



పెడన: పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం స్వామి వారికి ఊంజల సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలుకొని మకర సంక్రాంతి సందర్భంగా వేణుగోపాలస్వామి వారికి ఊంజల సేవను ప్రధాన అర్చకులు అగ్నిహోత్రం హరికృష్ణాచార్యులు నిర్వహించారు. భక్తుల సహాయ సహకారాలతో ఈ సేవా కార్యక్రమం అత్యంత వైభవంగా చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

క్రీస్తు సువార్త సభలు ప్రారంభం



మచిలీపట్నంటౌన్: నేటి సమాజ మార్పునకు క్రైస్తవ్యం తన వంతుగా ఎంతో కృషి చేస్తుందని చెన్నైకు చెందిన పాస్టర్ కేలేబ్ డానియేల్ అన్నారు. నగరంలోని మల్కాపట్నం ఎల్ఈఎఫ్ చర్చిలో సోమవారం నుంచి క్రీస్తు సువార్త సభలు ప్రారంభమయ్యాయి. ఈ సభల్లో ముఖ్య ప్రసంగీకునిగా పాల్గొన్న డానియేల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తును అనుసరించి విలువైన వ్యక్తిత్వాన్ని సంపాదించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏసుక్రీస్తు బోధనల ద్వారా మానవుడు మానసికంగా ఎంతో మార్పు చెంది శాంతి, సమాధానంతో జీవిస్తారన్నారు. మంగళవారంతో ఈ సువార్త సభలు ముగుస్తాయని నగరవాసులు సందర్శించి దైవదీవెనలు పొందాలని సంఘకాపరి తంటిపూడి ప్రభాకరరావు కోరారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి శాంతి కల్యాణంకు వైభవంగా నిర్వహించారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని దీవి మనోజ్ దంపతులు స్వామివారికి శాంతి కల్యాణం చేశారు. తొలుత స్వామివార్లను ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేయించారు. దీవి వెంకట రామశ్రీనివాస్, దీవి వెంకట్రామాచార్యులు, అప్పలాచార్యులు, డీవీఎస్ కృష్ణ, నరసింహమూర్తి పర్యవేక్షించారు.

పొలాల్లో గోవుల పండుగ

కోడూరు: కనుమ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో గోవుల పండుగను నిర్వహించారు. లింగారెడ్డిపాలెం గ్రామంలో అనాదిగా వస్తున్న ఆచారం ప్రచారం పొలాల్లో గోవుల పండుగ చేశారు. గ్రామంలోని రామాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారి విగ్రహాలను గ్రామంలో ఊరేగించుకుంటూ పొలాల వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ అన్నదాతలు కట్లపొయ్యిపై పొంగలి తయారు చేసి స్వామివారికి సమర్పించారు. గ్రామానికి చెందిన మహిళలు రహదారి పొడవునా రథం ముగ్గులు వేసి స్వామివారికి ఘనస్వాగతం పలికారు. కోడూరు శివరామకృష్ణ క్షేత్రంలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.

28న రథసప్తమి వేడుకలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఆజాద్‌రోడ్డులో ఉన్న కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 28వ తేదీ రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలోని సూర్యనారాయణస్వామికి పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మాఘమాసం సందర్భంగా ఈ నెల 22, 29, ఫిబ్రవరి 5, 12, 19 తేదీల్లో సూర్యనమస్కారాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు హాజరై సూర్యభగవానుని అనుగ్రహం పొందాలని కోరారు.

వందేభారత్‌కు స్వాగతం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వందేభారత్ సికింద్రాబాద్-విశాఖపట్టణం నూతన రైలుకు హనుమాన్‌జంక్షన్‌లోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా స్వాగతం పలికారు. వందేభారత్ లోకో పైలట్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు తరలివచ్చారు. ట్రయిల్ రన్ భాగంగా ఇక్కడి రైల్వేస్టేషన్‌లో నిముషం పాటు నిలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట మురళీధర్, ముత్తిరెడ్డి పిచ్చేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరువోలు బుచ్చిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం గజేంద్రరావు, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుకలు

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో మంత్రి జోగి రమేష్, శకుంతలాదేవి దంపతులు కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు శుభాకాంక్షలు చెబుతూ పుష్పగుచ్చాలను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు భళ్ల జ్యోత్స్నరాణి గంగయ్య, ఎంపీపీ దంపతులు రాజులపాటి వాణి, అచ్యుతరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ దంపతులు గరికిపాటి చారుమతి వెంకటరామానాయుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దంపతులు కటకం ప్రసాద్, నాగకుమారి, వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతిలతో పాటు బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు ఎంపీపీలు చినబాబు, గరుడప్రసాద్, మధుసూదనరావు, జెడ్పీటీసీ రత్నకుమారి, నాయకులు మల్లి, నాగబాబు, రాజబాబు, వెంకట్రాజు, రవికుమార్, వెంకటకృష్ణలతో పాటు ఆయా సంఘాలు, కార్పొరేషన్లకు చెందిన నాయకులు, సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, మహిళా సంఘాలు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రి జోగి రమేష్ తనకు శుభాకాంక్షలు తెలిపినావారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బంటుమిల్లి: రాష్ట్ర మంత్రి, పెడన ఎమ్మెల్యే జోగి రమేష్ పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నాగేశ్వరరావుపేట రోడ్డు వద్ద యనుముల కొండ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అభిమానులకు, మిఠాయిలు పంచిపెట్టారు. ఎంపీపీ వి. చినబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు, మండల సచివాలయాల కన్వీనరు కె. సుబ్బారావు, లక్ష్మీనారాయణపురం, జానకీరామపురం గ్రామ కన్వీనర్లు వెంకటేశ్వరరావు, ఎల్. మారుతి, కొర్లపాడు, సాతులూరు మాజీ సర్పంచులు బి. గాంధీ, సిహెచ్. రాధకృష్ణ, నాయకులు జి. ఏడుకొండలు, అభిమానులు పాల్గొన్నారు.


భార్య శకుంతలాదేవితో కలిసి బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న మంత్రి జోగి రమేష్


నాగేశ్వరరావుపేట రోడ్డు వద్ద మంత్రి జోగి పుట్టినరోజు వేడుకలు చేస్తున్న నాయకులు

యువ పారిశ్రామికవేత్త రమేష్‌కు సత్కారం

అవనిగడ్డ: మోపిదేవి మండలం కె కొత్తపాలెంకు చెందిన యువ పారిశ్రామిక వేత్త, సంఘ సేవకుడు తూము రమేష్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యులు సింహాద్రి, వైఎస్సార్ సీపీ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు రమేష్‌ని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) సభ్యుడిగా, ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు గత పది సంవత్సరాల నుంచి ఉపకార వేతనాలు అందించడంతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న రమేష్ యువకులకు ఆదర్శనీయుడన్నారు. థాట్ వేవ్ ఇన్ఫోసిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులుగా రమేష్ యూఎస్ఏ, బెంగళూరు, హైదరాబాద్, వైజాక్, చల్లపల్లిలో ఎంతో మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నారని చెప్పారు. ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నలుకుర్తి రమేష్, న్యాయవాది పులి శ్రీనివాసరావు, కె.మోహన్‌బాబు, చింతా ప్రసాద్, నీలా బింద్రన్, నీలా మనోహర్‌తో పాటు పలువురు యువకులు పాల్గొన్నారు.


తూము రమేష్‌ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

విద్యుదాఘాతంతో రేకుల షెడ్డు దగ్ధం

పెడన: మండలంలోని నందమూరు గ్రామ పంచాయతీ శివారు కోటవానిపాలెంకు చెందిన పేరం చిననాగరాజు నివశిస్తున్న రేకులషెడ్డు ఇల్లు సోమవారం అగ్నికి ఆహుతైంది. వీఆర్వో, బాధితులు తెలిపిన వివరాల మేరకు.... ఇంట్లోని వారు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఆస్తి నష్టంపై ఇంకా అంచనాకు రాలేకపోయారు. జరిగిన సంఘటన విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీటీసీ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతాబ్రహ్మ విష్ణుపరమేశ్వరరావు, బెనర్జీ, భగవాన్, వాకాలయ్య తదితరులు బాధితులను కలిసి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధితులు రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బందికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.


అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోమాతకు ఘనంగా సీమంతం

నాగాయలంక: గ్రామంలోని సాలిపేటలో సోమవారం గోమాతకు సీమంత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణానదీతీరంలో కొలువైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాసగాంధీ సంరక్షణలోని గోమాత మీనాక్షికి తొమ్మిది నెలల నూడి నిండిన సందర్భంగా సీమంతం చేశారు. దేవదాయశాఖలో టెక్నికల్ ఆఫీసర్, ప్రముఖ మిమిక్రీస్టార్ భవిరి రవి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీ బ్రహ్మత్వంలో రవి దంపతులు, ఆ ఇంటి మహిళలు సంప్రదాయ రీతిలో గోమాత సీమంతం పూజలు నిర్వహించారు. గోవులకు సంబంధించిన భక్తిగీతాల గానంతో సందడి చేశారు. ఆ ఇంటికి చెందిన 9 కుటుంబాలు 60 మంది సభ్యులతో ఈ వేడుకను చేశారు. రిటైర్డ్ ఎంఈఓ భవిరి శంకరనాథ్, బ్రహ్మంగారి ఆలయ ధర్మకర్త సుధాకర్, గ్రామ ప్రముఖులు తదితరులు ఈవేడుకలో పాల్గొని సీమంతం నిర్వాహకులను అభినందించారు.


గోవుకు సీమంతం చేస్తున్న భవిరి రవి దంపతులు

కోడిపందేల శిబిరాలపై పోలీసుల దాడులు

కైకలూరు: జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో కైకలూరు నియోజకవర్గం అన్ని మండలాల్లో కోడి పందేలు, పేకాట, గుండాటలపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. అనేక గ్రామాల్లో పందేల కోసం వేసిన టెంటులను స్వయంగా ఎస్ఐలు ధ్వంసం చేశారు. కై కలూరు రూరల్ సర్కిల్ సీఐ వైవీవీఎల్ నాయుడు, పట్టణ సీఐ ఎంవీఎస్ నాగరాజు ఆదేశాలతో అన్ని చోట్ల పందేలను నిలుపుదల చేశారు. కలిదిండి మండలంలో కోడిపందేలు, పేకాటకు సంబంధించి 36 కేసుల్లో 70 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి 10 పుంజులు, రూ.30,710 నగదును స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి మండలంలో కోడిపందేలు, పేకాట, గుండాటలపై 17 కేసులు నమోదు కాగా రూ.53,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు రూరల్ స్టేషన్ పరిధిలో సోమవారం భుజబలపట్నం, ఆలపాడు, వరహాపట్నం గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట నిమిత్తం 8 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.4,570 నగదును స్వాధీనం చేసుకున్నారు.